

# జనవందనం

యామినీ సరస్వతి

సర్కిల్ ఇనుస్పెక్టరుగా అతన్ని వేస్తున్నారనగానే బందిపోటు గుండెల్లో బాణం దిగినట్టుగా అయింది ఆ పట్టణం లోని నేరస్థులకి, నేరాన్ని ప్రోత్సహించే వారికి, నేరాన్ని రక్షించేవారికి.

పులి ఊరుపై పడి పశువుల్ని చంపేసినట్టు, పైరుని ఎలగ్గొడ్లు త్రొక్కి నాశనం చేసినట్టు ఊరు ఊరంతా భయపడిపోయింది.

అయితే కొంతమంది 'జనం' మాత్రం హాయిగా వూపిరి పీల్చుకున్నారు.

'మారాజొస్తున్నారంట! ఇంగేం భయంలేదు. ఎదవ డబ్బునంతా తీసికెళ్ళి మట్కాకు తగలబెడ్తున్నాడు. ఇగ యీని ఆటలు కట్టుబడతాయ్. నలుగురం సుగపడ్తాం' అనుకుంది ఓ మట్కా జూదరి 'తల్లి'

'సినిమాకి వెళ్ళిరావాలంటే భయం కదా! రెండో ఆట వదిలితే యిల్లు జేరే దాకా భయమే! ఆఖరికి రిక్షావాడే అన్యాయం చేస్తాడేమోనని భయపడాలి! ఇహ భయం లేదు!' అనుకుందో ఇల్లాలు.

'ఊరికి వెళ్ళకూడదు. తిరిగొచ్చే లోపల ఏం వుంటుందో ఏం పోతుందో తెలీదు. ఎక్కడ చూసినా దొంగతనాలు? దేశంలో లా అండ్ ఆర్డరుందా? దొంగలు పోలీసులకి భయపడుతున్నారా? అనిపిస్తోంది. వేసవిలో బయట పడుకోవాలన్నా భయమే! ఊరి కెళ్లాలన్నా భయమే! ఇహ ఫరవాలేదు.' అనుకున్నాడు ఓ మధ్యతరగతి గుమస్తా.

ఇలా యింతమంది జనవందనానికి కారణభూతుడు కొత్తగా ఆ స్టేషన్‌లో ఛార్జీ తీసుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టరు రెడ్డి.

అతను ఛార్జీ తీసుకుంటూనే తన క్రింద యస్.ఐ.ల నిద్దరినీ పిలిచాడు. రెడ్డి ముఖం ఎప్పుడూ నవ్వులు చిందుతూ వుంటుంది. అది ఆశ్రితులకి వెన్నెలలాగా

నేరస్తులకి ఫిరంగి మోతలాగావుంటుంది.

'మనం దేశంలో న్యాయాన్ని రక్షించేందుకు ఉన్నాం. దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, ఖూనీలు, నేరాలు జరక్కుండా చూడటం- జరిగితే నేరం చేసినవాడిని వెదికిపట్టుకుని చట్టబద్ధంగా శిక్షించటం మన విద్యుక్తధర్మం.

'ఈ ఖాకీ యూనిఫాం, ఈ హేట్, ఈ క్లిప్, ఈ స్టిక్ యివన్నీ ధర్మ రక్షణకి సాధనాలు- మనం వీటిని దుర్వినియోగం చెయ్యకూడదు. అన్యాయాల్ని అరికట్టవలసిన మనమే అన్యాయం చెయ్యకూడదు. నేరస్తులనుంచి మనం లంచం ఆశించకూడదు.

మనల్ని చూస్తే సామాన్యులు భయపడతారు. వారిలో ధర్మభీతి వుంది. అదీ భయానికి కారణం. మనం ధర్మానికి, నీతికి, న్యాయానికి, చట్టానికి కట్టుబడితే నేరస్తులూ మనల్ని గురించి భయపడతారు.

'ఈ వూళ్లో దొంగతనాలు, అల్లర్లు, పేకాట, మట్కా విశృంఖలంగా సాగుతున్నాయని తెలిసే నన్నిక్కడ వేశారు. చూడండి! నే నొక్కడినే ఏం చెయ్యలేను. మీ తోడు, మీ సహాయం కావాలి.

'మీరు బాధ్యత ఎరిగి ప్రవర్తిస్తే అవి నాకు అందుతాయి. మీరు డ్యూటీని మరిచిపోతే- నేను వాటిని ఎలాగైనా మీనుంచి రాబట్టుకోగల్ను. కానీ అది కష్టసాధ్యం. కానీ మనం మన పవిత్రమైన డ్యూటీలో కలసిమెలసి పనిచేస్తే దేన్నయినా సాధించగలం!'

ఇద్దరు ఎస్సైలూ ఏకకంఠంతో అతనికి బాసటగా నిలిచేందుకు హామీ యిచ్చారు. వాగ్దానం చేశారు.

* * *

సాయంకాలం ఆరుగంటల సమయం.

అప్సర థియేటర్ ఎదురుగా సందు మలుపులో ఓ బడ్డీకొట్టు. బడ్డీకొట్టు మనిషి గురయ్య గబగబా 'చీటీలు' రాస్తున్నాడు. చుట్టూ కూర్చున్న జనం ఆలోచిస్తూ, ఊహిస్తూ, లెక్కలేస్తూ 'ఏ నెంబరు' కెంతో వివరంగా చెబుతున్నారు.

హెడ్‌కానిస్టేబుల్ రంగయ్య వచ్చాడు హఠాత్తుగా.

'రా! మామా! రా! ఈ రోజు నీ ఓపెన్, నీ క్లోజుమీద పది రూపాయలు ఆడతా!' అన్నాడో వ్యక్తి.

రంగయ్య ముఖం ముడుచుకున్నాడు. 'ఇహ ఆట కట్టెయ్యాలి! ఈ రోజు వియ్యన్న కంపెనీమీద రైడుకు పోతున్నాం. కొత్త సర్కిల్ వచ్చాడు. ఇన్‌స్పెక్టర్ల దేం జరగటంలేదు. డిఎస్పీ దొరకూడా కుములుతున్నాడట- గురయ్యా చీటీలు రాయద్దు!'

గురయ్య తలెత్తి చూసి చిర్నవ్వు నవ్వి మళ్లీ బిజీగా రాయటం ప్రారంభించాడు.

'చెప్పేది నీక్కాదూ! ఆ ముండాకొడుకువస్తే- నిన్ను బొక్కలోతోస్తాడు. నన్ను మక్కెలిరగ తంతాడు. మన ఆటలు ఖాళీ- మనకి చెడ్డరోజులు వచ్చాయి___'

'పోదూ, నీ దంతా చోద్యం_' అన్నాడు గురయ్య.

అంతలో మోటర్‌సైకిల్ శబ్దం వినబడటమేమిటి రెడ్డి అక్కడ ప్రత్యక్షం కావటమేమిటి అక్కడ కూర్చున్న జనాన్ని 'కవర్' చేసి, గురయ్య నేలపడేట్టు తన్నడమేమిటి, అతని చేతిలోని 'స్లిప్పులు' లాక్కోడమేమిటి అంతా క్షణంలో జరిగిపోయింది.

రంగయ్య వినయ వినమ్రతుడైన భక్తుడిలాగా యథాశక్తి 'ఆటగాళ్లని' చుట్టుముట్టేడు.

అందర్నీ బజారువెంట నడిపిస్తూ తీసికెళ్లి 'కటకటాల' వెనుక వేశాడు. హెడ్ రంగయ్యని నోటికి వచ్చినట్టు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. రంగయ్య వంచిన తల ఎత్తలేదు.

ఇది జరిగిన పదిహేను నిమిషాలకి గురయ్య భార్య గురవమ్మ వార్డు కౌన్సిలర్ 'జయమ్మ' వద్దకి వెళ్లి ఏడ్చింది. ఆ వార్డులో ఆడజనాభా ఎక్కువ. వాళ్ల మద్దతుతోనే జయమ్మ కొద్ది ఓట్ల తేడాతో తన సమీప ప్రత్యర్థిపై విజయం సాధించింది. అంచేత జయమ్మకు 'గురవమ్మ' ముఖ్యం కానీ 'రెడ్డిగారి డ్యూటీ' ముఖ్యం కాదు. అందుకే నేరుగా చెయిర్మన్‌గారి వద్దకి వెళ్లి పోలీసు స్టేషన్‌కి ఫోను చేయించింది.

అంతా అరగంటలో సాధించింది గురవమ్మ.

'చెయిర్మన్‌గారి నుంచి ఫోనొచ్చింది' రిసీవర్ అందిస్తూ సర్కిల్‌వైపు అదోలా చూశాడు యస్సై. అతనికి గురయ్యని ఎరెస్ట్ చేస్తే ఎక్కడెక్కడ ఏయే 'కదలికలు' కదలుతాయో బాగా తెలుసు. 'నువ్వెంత! నీ రూలింగ్ ఎంత! పవర్‌కి లొంగిపోకుండా వుండగలవా?' అన్నట్లు చూశాడతను.

'హలో! దిసీజ్ పోలీస్‌స్టేషన్' రెడ్డిగారి కంఠం కరుగ్గా ధ్వనించింది. సర్వీసులో చేరకముందే ట్రెయినింగ్‌లోనే 'పోలీస్ వాయిస్' ఎలా వుండాలో అతనికి బాగా తెలుసు.

'ఏమయ్యా రెడ్డీ!' చెయిర్మన్ పిలుపులోనే తన అథార్టీని ప్రతిబింబిస్తూ పిలిచాడు 'నువ్వు గురయ్యని స్టేషన్‌కి తెచ్చావా?' అడిగాడు.

రెడ్డి పెదాలమధ్య నున్న సిగరెట్ కసిగా వెలిగి కదిలింది 'ఇలాటి అన్‌కూత్ ఫెలోస్‌ని యిక్కడే ఆపెయ్యాలి' అనుకున్నాడు. 'అవును. కేసు రిజిష్టరు చేశాను. రేపు కోర్టులో హాజరుపరుస్తాను. అంతో ఇంతో జరిమానా వేస్తారు తొలి నేరంగా. మళ్ళీమళ్ళీ కోర్టు ముఖానికొస్తే శిక్ష కూడా పడుతుంది. ఐ. పి. సి. నెంబర్ ...... ప్రకారం జూదం ఆడ

టం, ఆడించడం నేరం— ఆ విషయం మీకు తెలుసు— అనుకుంటాను'

చెయిర్మన్ రెడ్డికి సర్కిల్ 'ధోరణి' అర్థమైంది. 'పీకు యముడు' అనుకున్నాడు. 'కేసు రాసేశావా! అయితే సరేలే! ఇదిగో రెడ్డీ! మనం మనం ఒకటి— ఇలాటి విషయాలు వచ్చినపుడు అటూ యిటూ చూసి చేస్తూవుండు— వుంటాను' అన్నాడు.

సర్కిల్ ఫోన్ పెట్టేశాడు. అది తన తొలి విజయంగా భావించాడు.

* * *

వారం రోజులు గడిచాయి. దాదాపు ప్రముఖ స్థలాల్లో జరిగే 'మట్కా' బుకింగ్ ఆగిపోయింది. కంపెనీలు అన్నీ పబ్లిగ్గా 'మూతబడ్డాయి' ప్రయివేట్‌గా 'చీకటి మాటున' నడుస్తున్నాయి. వాటిని పూర్తిగా 'మలేరియా'ని, 'మశూచి'ని 'ఎరాడికేట్' చేసినట్టుగా చెయ్యటం అంత తొందరగా సాధ్యం కాదనుకున్నాడు సర్కిల్.

ఆ రోజు ట్రాఫిక్ రద్దీలో సిటిబస్సు క్రింద ఎవరో అనామకుడు పడ్డాడు. చని పోలేదు. కానీ కాలు విరిగింది. స్టేజిలేని చోట ఆపి, ఒవర్‌లోడ్‌లో వెళుతోంది బస్సు. ఆ సమయంలో హఠాత్తుగా రోడ్డు దాటబోయి యాక్సిడెంటుకి లోనయ్యాడు ఆ దౌర్భాగ్యుడు.

బస్సుని స్టేషన్ దగ్గరికి లాక్కొచ్చాడు రెడ్డి.

డ్రయివర్ ధీమాగా వున్నాడు. ఆ బస్సు ఒక ఎమ్మెల్యేగారి బావమరిదిది. తీగలాగితే డొంకంతా కదులుతుంది. నన్నేంచేస్తాడ్లే అనుకున్నాడు డ్రయివర్.

అతనాశించిన విధంగానే ఆ బామ్మర్ది కోసం, ఆ ఎమ్మెల్యే స్థానిక ఎమ్మెల్యే కలసి 'స్టేషన్'కి వచ్చారు.

అసలే బలశాలి....దానికి తోడు స్థాన బలిమి.

విజృంభించాడు రెడ్డి. 'చూడండి! ప్రాణం విలువ ఎవరికయినా ఒకటే. సిటీబస్సులు యమదూతలు, ఆ డ్రైవర్లు యమకింకరులు కాదు. ఇలా యిష్టం వచ్చినట్లు యాక్సిడెంట్స్ చేయాటానికి వాళ్ళకి 'లైసెన్స్' లేదు—'

నవ్వేడు ఎమ్మెల్యే. ఖూనీలు చేయించి ప్రత్యర్థి వర్గాన్ని జయించుకొచ్చిన ధీశాలి అతని బామ్మర్ది, వాళ్ళకి యీ మాటలు రుచిస్తాయా? కవరు తీసి టేబిల్‌పై పెట్టి 'ఇదిగో రెడ్డిగారూ! ఈ సారికి వదిలెయ్యండి. ఇక ముందు జాగ్రత్తగా వుంటాడు' అన్నాడు.

రెడ్డి ముఖం జేవురించింది. పెదాలు అదరసాగాయి. చప్పున లేచి నుంచుని 'ప్లీజ్! మీరు వెళ్ళండి. ప్రజాప్రతినిధులు మీరు. మీరే నన్ను యిలా డబ్బుకి కొనుక్కోవాలనుకోవడం— ఛ!ఛ!— నేను చెప్పలేను. అతన్ని రిమాండ్‌లోకి తీసుకుంటున్నాను. కేసు పెడుతున్నాను.' అన్నాడు.



ఎమ్మెల్యే బావమరిది ముఖం మాడిపోయింది. అక్కడికక్కడే 'అతన్ని' కాల్చెయ్యాలన్నంత కసి వచ్చింది. జేబులో వున్న నాటు రివాల్వర్ డొక్కలో పొడుస్తున్నట్టుగాఅనిపించింది.

ఎమ్మెల్యే నవ్వేడు. 'డోంట్ బి సిల్లీ! ఇలా అయితే నువ్వు సర్వీసేం చేస్తావు. ఇక్కడి నుంచి యింకోచోటికి ట్రాన్స్‌ఫర్. అక్కడి నుంచి మరోచోటికి! అలా అలా వూళ్ళు తిరగాలి. నీకూ సుఖం లేదు— నీ భార్యబిడ్డలకి సుఖం వుండదు. ఇదిగో ఒక మాట విను— ఇది ప్రజా ప్రభుత్వం. అంటే మా ప్రభుత్వం. మీ యాజమానులం మేమే! నువ్విలా పెడసరంగా, ఉలిపికట్టెలా వ్యవహరిస్తే నష్టపోయేది నువ్వే—'

'థాంక్స్! అయినా పర్లేదు, కర్తవ్య నిర్వహణలో ప్రాణం పోయినా ఫర్లేదు_'

'పరమచక్రబిరుదొస్తుందా? అదయినా ముండమోపి అయిన నీ భార్యకి యిస్తారు' ఎద్దేవగా అన్నాడు.

పెదాలు కొరుక్కున్నాడు రెడ్డి. ఆ ఇద్దర్నీ లాఠీలలో బాదాలన్నంత కసి పెదాలని గాయపరిచింది. కానీ 'ఏటి కసి' అతన్ని రక్షించింది. 'ప్లీజ్. వెళ్ళిపొండి' అన్నాడు మర్యాదగా.

'నా మాట వినవా!'

'నాది ఒకటే మాట!'

'అయితే అనుభవిస్తావు' అని చర్రున లేచి వెళ్లిపోయాడు ఎమ్మెల్యే_

ఆలోచనలోపడ్డాడు సర్కిల్ ఇన్స్పెక్టర్.

ఆ సాయంకాలమే సిటీ బస్సుల వాళ్లు 'స్ట్రయిక్' చేశారు. ప్రజల్ని యిబ్బంది పెడితే 'వాళ్లు' సమస్యల్ని అర్థంచేసుకుంటారన్న అందరి మామూలు పిచ్చి ధోరణిలోనే వాళ్లూ చేశారు. సి.ఐ.ని గురించి వ్యతిరేక నినాదాలు, కేకలు.... కానీ అతను చలించలేదు.

కేసు కోర్టుకి పంపేడు

* * *

అయితే ఆ మరుసటిరోజు ఒక అనుకోని అద్భుతం జరిగిపోయింది. టౌన్‌లో వున్న ప్రతిపక్షాలు, ప్రజాసేవా సంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థలు, విద్యార్థులు అన్ని యూనియన్‌ల వాళ్లూ ఒక బ్రహ్మాండమైన ప్రజావెల్లువలాగ సి.ఐ.కి అనుకూలంగా, వాళ్లకి వ్యతిరేకంగా టౌన్‌లో ఒక ర్యాలీ నిర్వహించారు. టౌన్ అంతా తిరిగి స్టేషన్ ముందుకి వచ్చి సి.ఐ.ని స్టేషన్‌నుంచి బయటకి రప్పించి, ఆ టౌన్లో కనీవినీ ఎరుగని విధంగా అతన్ని పూలదండలతో, జై జై నినాదాలతో ముంచెత్తారు.

అతనికి ముందుగా 'అభిమానం' వేసింది. ఆ సన్మానాన్ని అందుకోవటం యిష్టం లేదన్నాడు. కానీ వరదలాగా వచ్చిన జనప్రవాహాన్ని, జనవందనాన్ని కాదనలేకపోయాడు.

నిన్నటి నిరసనకి యీ ప్రదర్శన జవాబుగా అనుకున్నారు జనం. ఎక్కడైనా న్యాయానికి, నిజాయితీకి గుర్తింపు ఉందని 'బ్రిటీష్' కాలంనాటి 'మనుషులు' అనుకున్నారు___

* * *

అభినందన మనిషిలో ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది. ప్రోత్సాహం శక్తిని రెట్టింపు చేస్తుంది. తను అనుసరిస్తోన్న విధానం విద్యావంతుల్లో, మధ్యతరగతి మనుషుల్లోనే కాక అట్టడుగు జనాలైన కూలీలు, రిక్షావాళ్ళు, జట్కాబళ్ల వాళ్లలో కూడా గుర్తింపు పొందిందని తెలుసుకున్న సి.ఐ. రెడ్డి తన కర్తవ్యనిర్వహణలో యింకా శ్రద్ధగా వుండాలని నిర్ణయించుకున్నాడు.

'దేశాన్ని బాగుచెయ్యాలంటే బాధ్యతాయుతమైన ఉద్యోగంలోవున్న వ్యక్తి యితర్ల గురించి ఆలోచించక తన మట్టుకి తను తన డ్యూటీని సక్రమంగా నిర్వహిస్తే చాలు_ దేశం బాగుపడుతుంది' అనుకున్నాడతను.

ఆరోజు అతనికొక ఉత్తరం వచ్చింది. అతను వచ్చాక టౌన్లో మట్కా జూదం పూర్తిగా నశించకపోయినా, అది తన అస్థిత్వాన్నికోల్పోవడంవల్ల ఎన్నికుటుంబాలు బాగుపడ్డాయో వివరిస్తూ తన కుటుంబం ఎలా బాగుపడిందీ, తన భర్త మార్గం మళ్లడం వల్ల తనూ, తన సంతానం ఎంతగా సుఖపడుతున్నారో వివరిస్తూ రాసిందా గృహిణి.

అందులోనే ఆమె తమ వీధిలోనే హోటల్ పేరుతో నడుస్తోన్న లాడ్జింగ్ గురించి, అందులో సాగుతున్న వ్యభిచారాన్ని గురించీ రాసి, అలాంటి మాలిన్యాన్నికూడా తొలగించమని కోరింది.

ఉత్తరం చదివిన సి.ఐ. నిటారుగా కూర్చున్నాడు. వెంటనే చర్య తీసుకోవలసిన అత్యవసరమయిన విషయంగా భావించి ఆ విభాగం యస్సైని పిలిచాడు.

అతడు రాగానే చెయిర్ చూపించి 'కూర్చో' అన్నాడు.

కొంత జంకుతూనే కూర్చున్నాడు యస్సై శివం. అతని ఏరియాలో 'మట్కా' పూర్తిగా నిరోధింపబడలేదు. వారం, వారం వచ్చే మామూళ్ళు, డియస్పీనుంచి వచ్చిన వత్తిళ్ళు అతన్ని మెత్తబరిచాయి. అంచేత చూసీ చూడకుండా వుంటున్నాడు.

'శివం! రేవతి హోటల్ గురించి తెలుసా?'

ఉలిక్కిపడ్డాడు శివం ఆ పేరు వినగానే. 'అది' అతని విశ్రాంతి మందిరం. అతనికే కాదు 'అవసరమైన' ఆఫీసర్లకి అది విశ్రాంతినిచ్చే కేంద్రం. దాని విషయం ఎవరికీ తెలీదు_ పరమ గోప్యంగా అక్కడికి 'పెద్ద' 'పెద్ద' వాళ్లొచ్చి వెళతారు_ ఆ విషయం ఇతనికెలా తెలిసిందీ? తెలిసే అవకాశమే లేదు_

'ఈ ఉత్తరం చూడు!'

ఏకబిగిని ఆ ఉత్తరం 'చూశాడు' శివం. వెంటనే అతను ఆశ్చర్యాన్ని 'నటించాడు.' 'నో!నో!' నేను నమ్మను!' అన్నాడు.

'నువ్వు విశ్వాసివి కదా! అందుకే విశ్వసించవు' నవ్వుతూ అన్నాడు_

'ఇతను జోకులు కూడా పేలుస్తాడా! ఏమో ! భార్యాబిడ్డలతోకూడా ముఖం మాడ్చుకునేమాట్లాడతాడు అనుకున్నానే!' శివం జవాబివ్వలేదు. మనసులోనే మథనపడసాగాడు.

'వెంటనే మనం రెయిడ్‌చేద్దాం' లేస్తూ అన్నాడు.

'కేసు___'

'ఆ విషయం నాకు వదిలెయ్! పబ్లిక్ న్యూసెన్సు క్రింద బుక్‌చేద్దాం_ అన

లింతకీ దోషులు దొరకాలి కదా!' హేట్ పెట్టుకుంటూ కుర్చీలోంచి లేచాడు.

విధిలేక విశ్వం అనుసరించాడు.

లాడ్జిమీద రెయిడ్ చేసే సమయానికి మూడు జంటలు దొరికారు. ముగ్గురూ పల్లెలనుంచి వచ్చిన 'అమ్మాయిలే.' మగవాళ్ళు మాత్రం అక్కడి వాళ్ళే.


అమ్మాయిలని 'మగవాళ్ల' భుజా లెక్కించి వీధిగుండా నడిపిస్తూ వచ్చాడు స్టేషన్‌దాకా. జనం అంతా వింతగా చూశారు. అబ్బురంగా చెప్పుకున్నారు. సి.ఐ.ని అభిందిస్తూ మాట్లాడుకున్నారు.

అవమానపరచి మళ్లీ జన్మలో 'ఆ నేరం' చేయాలనే మనస్సులో భావం పుట్టకుండా చేసి, మగవాళ్లపై కేసు బనాయించాడు. ఊరు ఊరంతా అట్టుడికి నట్టు ఉడికిపోయింది.

ఈ సంఘంలో ఎవరైనా ఒకవినూత్న సంఘటనకి కారకులవుతే దాన్ని అభినందించేవాళ్లెందరుంటారో అభిశంసంచేవాళ్లూ అందరే వుంటారు! మిత్రుత్వం, శత్రుత్వంసమానంగా వచ్చేస్తాయి. కాలం కర్మం సరిగా వున్నన్ని రోజులు, మంచి పైకి రాణించేట్టు వస్తుంది. చెడు అడుగున పడిపోతుంది.

టౌన్లో తనకి లభిస్తోన్న ప్రజాదరణ, ప్రజాభిమానం లెక్కించుకుంటున్న సి.ఐ. తన డ్యూటీలో యింకా ముందుకి వెళ్లిపోయాడు. ఫుట్‌పాత్ లేనిచోట రోడ్డువారగా దుకాణాలు తెరచినవాళ్లని తొలగించాడు. ట్రాఫిక్‌కి అడ్డంగా బళ్లల్లో కూరగాయలు, స్వీట్స్, పళ్ళూ అమ్ముకునేవాళ్లని 'మార్గం'లో పెట్టాడు.

సెంటర్స్‌లో నుంచుని గంటలకొద్దీ ఊకదంపుడు రాజకీయాలు మాట్లాడే వాళ్లకి 144వ సెక్షన్ అమల్లో పెట్టినంత తీవ్రంగా కదిలించాడు. ట్రాఫిక్‌రూల్స్‌ని అమల్లోపెట్టాడు. జేబుదొంగల్ని, చిల్లర మల్లర నేరస్తుల్ని 'అదుపు'లో పెట్టాడు. థియేటర్స్‌లో ఓవర్ లోడింగ్‌ని



కంట్రోల్ చేశాడు. టికెట్లు చించకుండా ప్రభుత్వాన్ని మోసంచేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌ని దగాచేస్తున్న థియేటర్స్‌ని 'చట్టం చట్రం'లోకి తెచ్చాడు.

బలహీనులకి బలంగా, దుర్బలులకి అండగా, సంఘ విద్రోహులకి గుండె గాలంగా నిలిచాడు సి.ఐ. రెడ్డి.

'మా స్టేషన్‌ముందు స్తంభాలకి రెండు సింహాలున్నాయి. ప్రభుత్వ చిహ్నంలో మూడు సింహం ముఖాలు ఉన్నాయి. ఈ ఊరికి మూడో 'సింహం మీరు' అని జనం అభినందించారు.

అదిగో పులి అంటే పిల్లలు జడుసుకున్నట్టుగా మోటర్‌సైకిల్ శబ్దం వింటే అడుగో సి.ఐ. అని అంతా హడలెత్తుతారు.

* * *

అర్ధరాత్రి—

ఇంట్లో భార్య సేవలో తృప్తిగా నిద్రపోతున్నాడు సి.ఐ. రెడ్డి అతని ప్రక్కనే పడుకొన్న అతని భార్య అతని ఎదుర్రొమ్ముపై తలపెట్టుకుని సుఖంగా కలలు కంటూ నిద్రపోతోంది. పక్కనే మంచంపై అతని ఆరేళ్ల కూతురు,పదేళ్ల కొడుకూ శాంతంగా శాంతిభద్రతలున్న దేశంలో సామాన్యుల్లా నిద్రపోతున్నారు.

ఏదో అలికిడి !

నిద్రాభంగమైంది రెడ్డికి.

ఫోన్ మోగుతోంది. సితారా మృదువుగా ధ్వనించినట్టు మోగుతోంది. అతనలా తన ఫోన్‌కి ఏర్పాటు చేసుకున్నాడు.

తన ఎదర్రొమ్ముపై తన కౌగిల్లో నిద్రపోతున్న భార్య చుట్టూ తీగలా చుట్టుకున్న చేతిని అలాగే వుంచి ఎడమ చేయి చాచి ఫోనందుకున్నాడు

'హలో!' హఠాత్తుగా నిద్ర మేల్కొన్నా స్వరం మాత్రం గంభీరంగానే ధ్వనించింది.

'హలో! సి.ఐ. గారేనా ?' ఎవరిదో కంఠం– అస్పష్టంగా ఆడా మగకి మధ్య రేంజ్‌లో వుంది

'అవును– ఏమిటి సంగతి?'

'సర్, హైవేలో 220 వ కిలోమీటరు వద్ద ఒక నడి వయస్సు మహిళని నలుగురు విద్యార్థులు 'రేప్' చేస్తో, హింసిస్తోన్నారు. బహుశా ఒక్కతే కార్లో వస్తోవుంటే అటకాయించారేమో! మీరు వెంటనే వెళితే ఆమె ప్రాణాలయినా కాపాడుగలుగుతారు–'

'మీ రెవరు?'

'చెప్పను' చప్పున ఫోన్ పెట్టేశాడు.

ఫోన్ అలాగే చేతిలో వుంది! ఏం చేయాలి?

'ఏమిటి?' నిద్రలేచిన అతని భార్య తులసి ప్రశ్నించింది.

అప్రయత్నంగా చెప్పేడు ఫోన్ విషయాన్ని. అత నేనాడూ ఆమెతో కేసుల గొడవలు చెప్పడు. ఇప్పుడు స్లిప్ అయ్యాడు.

'వెళుతున్నారా?' లేచి డ్రెస్ చేసుకుంటున్న భర్తని ప్రశ్నించింది. పిస్టల్ బొడ్లో దోపుకుంటున్న అతన్నే దీక్షగా చూస్తోంది. అతను జవాబివ్వలేదు.

మరి రెండునిముషాలతర్వాత 'తలుపు వేసుకో' అన్నాడు.

'ఒక్కరే వెళతారా?'భయంభయంగా అడిగింది.

అతను సమాధానంగా నవ్వి ఆమె బుగ్గపై చిటిక వేసి వెళ్లాడు. అతను వెళ్లిన కొద్దిసేపటికి ఏదో తోచిన తులసి 'స్టేషన్'కి ఫోన్‌చేసింది. డ్యూటిలో వున్న హెడ్‌కి విషయం చెప్పింది. పోలీసులని అక్కడికి పంపమనికోరింది.

* * *

'నువ్వు వీరుడివా?' ఫెడీలు మని ముఖాన దెబ్బ.

'మగధీరుడివా?' రొమ్ముపై బూట్ దెబ్బ.

'టౌన్‌ని మార్చేస్తావా?' డొక్కలో పోటు.

నలిగిపోతున్నాడు. క్రోధంతో, అవమానంతో, బాధతో, ఆత్మరక్షణ తోచని అపాయస్థితిలో నలిగిపోతున్నాడు అతని వాహనం రోడ్డుపక్క పడిపోయింది.

వేగంగా వస్తోన్న అతని వాహనాన్ని రోడ్డు దిగువనుంచి గురిపెట్టి కాల్చారు. టైరు బర్స్ట్ అయింది. మెలికలు తిరిగిన వాహనం నుంచి అతను దూకి క్రింద పడగానే పదిమంది ఒక్కుమ్మడిగా మీదపడ్డారు.

అతనికి తిరగబడే అవకాశం, తిరుగు దెబ్బ తీసే ఛాన్సు యివ్వలేదు. కాళ్లూ చేతులూ బంధించి, ఇష్టం వచ్చినట్టు కొడుతూ, తిడుతూ హింసిస్తున్నారు.

'ఒరేయ్', పదవి యిచ్చింది ప్రాణాలు తియ్యమని, తోడమనీ కాదు, నిలుపుకోమనీ, నిలపమనీ_ ఇది మా ప్రభుత్వం- అంతా మా యిష్టారాజ్యం. నీలాంటి ఒక బక్కవెధవ అడ్డునిలిస్తే ఏమవుతుంది! నీది తాత్కాలిక విజయం. మాది శాశ్వత విజయం.

నీ క్రింది ఆఫీసర్లు, జవాన్లు నిన్ను మెచ్చుకోరు_ గౌరవించరు. అభిమానించరు. నీ పై ఆఫీసర్లు నీ సేవని గుర్తించరు. ప్రభుత్వానికి యంత్రాంగం కావాలి. ఇలా నట్లు, స్క్రూలు లూజ్ చేసే నీలాటి మెషిన్‌గన్స్ కాదురా!

ఎందుకురా యీ కంచి గరుడసేవ? ఎవరి కోసం? ఎవరి గుర్తింపు కోసం? చెప్పు. ఇప్పటికయినా మించిపోయింది లేదు. అంతా సజావుగా సాగిపోనీ_ నువ్వుచూసీచూడనట్టు కళ్ళుమూసుకో_ బ్రతికిపోతావు. డబ్బుకావాలా?తీసుకో_ కాదంటావా! ఇవి నీ చివరి ఘడియలు."

అగ్ని గోళంలా దహించుకుపోతున్నాడు రెడ్డి. వీళ్ళ నీతి, హితబోధనకి అసహ్యం వేసింది. 'ఛీ' అన్నాడు. 'ఎన్నాళ్ళు బ్రతికినా చావు. తప్పదు. ఇలా తొత్తుగా, నీచంగా బ్రతికేకన్న-'

అంతే!

* * *

బ్రహ్మాండమైన ఊరేగింపు___

పోస్టుమార్టం చేయబడి, ముక్కాముఖం గుర్తింపు దొరకని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రెడ్డిశవం పోలీసుశకటంలో పూలదండల మధ్య అగరొత్తుల మధ్య వుంది.

వెనుక ఖిన్నులైన ప్రజ.... అశేష ప్రజానీకం గుండెల్లో గూడుకట్టిన విషాదం....ముఖాల్లో చిమ్మరేగే దుఃఖం.

కర్తవ్యానికి బలిఅయిపోయి, నిజాయితీకి ఖూనీ అయిపోయి, నిస్వార్థానికి ప్రతిగా హత్యగావింపబడిన సి.ఐ. రెడ్డి శవం మరికొన్ని గంటల తర్వాత భస్మమయిపోయింది.

ఆయన శరీరం నుంచి వెలువడిన అగ్ని శిఖలు శిఖలుగా నాలుకలు జాచుకుంటూ దేశంలోని యువకుల్లో నిజాయతీని, నిస్వార్థాన్ని,కర్తవ్యదీక్షను ప్రజ్వరిల్లచేయటానికా అన్నట్టు ఆకాశంకేసి ఎగిసీ ఎగిసి పోతున్నది.

